ప్రజాశక్తి
శనివారం 28 అక్టోబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

# మహిళలదే పై చేయి

- స్వల్పంగా ఓటర్ల పెరుగుదల
- ముసాయిదా జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్
- అత్యధికంగా మంగళగిరి, అత్యల్పంగా తాడికొండ
- మార్పులు చేర్పులకు డిసెంబరు 9 వరకు గడువు



ఓటర్ల ముసాయిదా జాబితాతో గుంటూరు జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలను ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. గుంటూరు జిల్లాలో 17,34,797 మంది, పల్నాడు జిల్లాలో 17,01,300 మంది ఓటర్లున్నట్లు నిర్ధారించారు. గతేడాది జులై నుంచి డిసెంబరు వరకు మార్పులు, చేర్పులు అనంతరం 2023 జనవరిలో ప్రకటించిన తుది జాబితాతో పోలిస్తే గత 10 నెలల కాలంలో పెరుగుదల స్వల్పంగా ఉంది. గత జనవరిలో గుంటూరు జిల్లా పరిధిలో 17,11,082 మంది ఉండగా పల్నాడు జిల్లాలో 16,87,820 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. గత 10 నెలల కాలంలో గుంటూరు జిల్లాలో 23,715 మంది ఓటర్లు పెరగ్గా, పల్నాడులో 13,480 మంది పెరిగారు.

రెండు జిల్లాల పరిధిలో మరణించిన వారి పేర్లను తొలగించగా కొత్తగా చేరిన వారు అధికంగానే ఉన్నారు. గుంటూరు జిల్లాలో 43 వేలు, పల్నాడులో 40 వేల మంది మృతులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం మహిళలు 51.5 శాతం మంది, పురుషులు 49.3 శాతం మంది ఉన్నారు. రెండు జిల్లాల పరిధిలో మంగళగిరిలో అత్యధికంగా 2,78,452 మంది ఓటర్లు ఉండగా తాడికొండలో అత్యల్పంగా 2,01,485 మంది ఓటర్లున్నారు. కొత్తగా ఓటర్లుగా చేరేవారు ఫారం 6, అభ్యంతరాలు, తొలగింపునకు ఫారం-7, ఒక చోట నుంచి మరొక చోటకి మారాలనుకునే వారు ఫారం-8 సమర్పించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిసెంబరు 9లోగా మార్పులు, చేర్పులకు అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల వారు జాబితాలపై దృష్టి సారించాయి. ముసాయిదా జాబితాల పరిశీలన అనంతరం తిరిగి అభ్యంతరాల స్వీకరణ, జాబితాల్లో పేర్లు లేని వారు తిరిగి చేరేందుకు అవకాశం కల్పించారు. తమకు తెలియకుండా తమ పేరున ఫారం-7 ప్రత్యర్థులు జారీ చేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. మరణించిన వారి వివరాలను కూడా పోలింగ్ బూత్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు సూచించింది.

### నియోజకవర్గాల వారీగాముసాయిదా ఓటర్ల జాబితాల వివరాలు

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్‌జండర్ | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| తాడికొండ | 97,236 | 103970 | 7 | 272 | 201485 |
| మంగళగిరి | 134253 | 143991 | 22 | 186 | 278452 |
| పొన్నూరు | 116275 | 223995 | 18 | 568 | 223995 |
| తెనాలి | 125730 | 134699 | 45 | 451 | 260925 |
| పత్తిపాడు | 124989 | 133874 | 30 | 454 | 259347 |
| గుంటూరు వెస్ట్ | 131214 | 137547 | 54 | 562 | 269377 |
| గుంటూరుతూర్పు | 118281 | 124822 | 38 | 157 | 243298 |
| పెదకూరపాడు | 110062 | 114485 | 23 | 145 | 224570 |
| చిలకలూరిపేట | 107925 | 117009 | 49 | 224 | 224983 |
| నరసరావుపేట | 111931 | 116688 | 38 | 187 | 228657 |
| సత్తెనపల్లి | 114976 | 119449 | 17 | 280 | 234442 |
| వినుకొండ | 128638 | 129331 | 21 | 210 | 257990 |
| గురజాల | 130782 | 137185 | 43 | 151 | 268010 |
| మాచర్ల | 129609 | 133115 | 23 | 110 | 262648 |

# ఆరుతడి పంటలకు నీరివ్వాలి

- బిజెపి పాలనలో అన్ని రంగాలూ కుదేలు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- 7న పల్నాడు జిల్లాకు ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక దేశం అప్పులు రూ.100 లక్షల కోట్లు పైబడి పెంచారని, ఆ నిధుల నుండి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేటాయింపులు మాత్రం నామమాత్రమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ బిజెపి పాలనలో పరిశ్రమలు, వ్యవసాయం, విద్య తదితర రంగాలు కుదేలవుతున్నాయని, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మతోన్మాద బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన అడుగడునా మద్దతు తెలుపుతున్నాయని, ఆ పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ అంశాలపై ప్రజా రక్షణ భేరి కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తామని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనతో సాగర్ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలేశారని, వాటికీ నీరివ్వకపోవడంతో ఎండిపోయే దశలో పైర్లున్నాయని తెలిపారు. సాగునీటిని తక్షణమే విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.

గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలలో ఎండగడుతూ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి ▶ 2లో

# ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి

### పలుచోట్ల పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణతో ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

నవంబర్ 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజా రక్షణభేరి ప్రణాళికను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ప్రజా రక్షణ భేరి జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ఉండవల్లి సెంటర్‌లో శుక్రవారం ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. మేకా అమరారెడ్డి భవన్‌లో కరపత్రాన్ని రామారావు ఆవిష్కరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, డి.శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, వై.బర్నబస్, డివి భాస్కరరెడ్డి, ఆచారి పాల్గొన్నారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ రాజధాని డివిజన్ కమిటీ విస్తృత సమావేశం ఎస్కె పీరూసాహెబ్ అధ్యక్షతన జరిగింది. రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు చేయకుండా వెన్నుబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి వంత పాడటాన్ని ప్రజలు క్షమించరన్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకుండా రాజధాని ప్రజలను నట్టేటా ముంచారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నం వెళ్లడం భూములు కొల్లగొట్టడానికేనని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. యాత్రల ముగింపు సందర్భంగా నవంబర్ 15న బిఆర్‌టిఎస్ రోడ్డులోని ఫుడ్ జంక్షన్ నుంచి మహా ప్రదర్శన, రెడ్‌షట్ వాలంటీర్ల కవాతు ఉంటుందని చెప్పారు. సింగ్‌నగర్ ఎంబి స్టేడియంలో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో రాజధాని డివిజన్ కారదర్శి ఎం.రవి, నాయకులు ▶ 2లో




ఉండవల్లిలో ప్రచారం చేస్తున్న పాశం రామారావు, సిపిఎం శ్రేణులు



8లో

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

# పల్నాడు బాలోత్సవం బ్రోచర్ల ఆవిష్కరణ

## ఆరుతడి పంటలకు నీరివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

సిపిఎం విధానాలను ప్రజలకు వివరిస్తూ ఈనెల 30న కర్నూలులో బయలుదేరే ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర 7న పల్నాడు జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. యాత్రకు ఘన స్వాగతం పలకడంతో పాటు నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సత్తెనపల్లి, 8న చిలకలూరిపేటలో జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కాపాడుకోవడం అందరి హక్కు అనే నినాదంతో కార్మికులు చేస్తున్న పోరాటానికి సిపిఎం పూర్తి సంఘీభావం తెలుపుతుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా రాష్ట్రాన్ని నిలిపిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. రాజధాని అమరావతిగా ప్రకటించి రాజధాని నిర్మాణానికి కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు అవసరమైతే అఖిలపక్షాల సహాయం తీసుకోవాలని సూచించారు. విశాఖ రైల్వే జోన్, ఓడరేవుల అభివృద్ధి మరియు ప్రభుత్వ రంగ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం సిపిఎం దశలవారీగా పోరాటం సాగిస్తోందన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు సంబంధించి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేలా ఉన్న జిందాల్ సంస్థకు అప్పజెప్పిన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు సాగునీరు అందించాలని, లేదా పంట నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పనుల్లేక అర్థాకలితో అలమటిస్తున్న గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి 200 రోజుల పని దినాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్రానికి రావలసిన 11 యూనివర్సిటీలను రాబట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజారక్షణ భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, నాయకులు డి.శివకుమారి, ఫాతిమా, సిలార్ మసూద్, రబ్బాని, హుస్సేన్, సుభాని, కె.సాయి కుమార్, ఆంజనేయరాజు పాల్గొన్నారు.



## ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సిహెచ్.సుందరరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - మంగళగిరి :** లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సాయమేమీ చేయలేదని, పైగా హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అన్యాయం చేసిందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు వివి జవహర్లాల్, ఎం.బాలాజీ, ఎస్.వెంకటేష్, కె.వెంకటేశ్వరరావు, డి.రామారావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - తాడికొండ :** విజయవాడలో 15వ తేదీన జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కె.అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక పాత సినిమా హాల్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. భాస్కరరావు, కె.పూర్ణచంద్రరావు, కె.స్రవంతి, ఐ.రామారావు, బి.భద్రయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై బైక్‌లు, ఆటోలకు అనుమతి లేదు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు మోటరు సైకిళ్ళు, ఆటోలు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోనే ప్రయాణించేలా రవాణా శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిబంధలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణించటం వలన ఇటీవల రహదారి ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సర్వీస్ రోడ్డులోనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి ప్రక్కన వ్యర్థాలు వేయకుండా సంబంధిత మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాల్వలు సక్రమంగా ప్రవహించేలా జాతీయ రహదారి అధికారులను సమన్వయం చేసుకొని మున్సిపల్ అధికారులు డ్రైనేజీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తెనాలి- నారాకోడూరు రహదారి మధ్యలోని బ్లాక్ స్పాట్‌ల వద్ద అవసరమైన పనుల నిర్వహణకు రహదారి భద్రత కమిటీ నిధులు మంజూరు చేసినందున వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. అలాగే నగరంలోని ఆర్అండ్‌బి రహదారుల అభివద్ధి పనులు కాంట్రాక్టర్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్.కె.కరీమ్, జిఎంసి ఎస్ఈ భాస్కర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, ఎన్‌హెచ్ఎఐ పీడీ అండ్ డీజీఎం(టీ) టి.పార్వతీశం, జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్, తెనాలి ఆర్టీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు

జిల్లాలోని లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పి.సి.పి.ఎన్.డి.టి యాక్ట్‌పై నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ, జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.అర్చన, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్య నేరము, అడిగినవారు ప్రోత్సహించినవారు శిక్షార్హులు అనే బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలన్నారు. తనిఖీలు నిర్వహించి చట్టం అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయమూర్తి అర్చన మాట్లాడుతూ ఈ చట్టంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు జిల్లాలో కొత్తగా రిజిస్ట్రేషన్‌కు 12 కేంద్రాలు, రెన్యూవల్ కోసం 8 కేంద్రాలు, రద్దు కోసం 10 కేంద్రాలు, మోడిఫికేషన్ కొరకు 9 కేంద్రాలు దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు. కమిటీ ఆయా దరఖాస్తులను ఆమోదించింది. సమావేశంలో కమిటీ సభ్యులు ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్, గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, పీడియాట్రిస్ట్ డాక్టర్ రవీంద్రనాయక్, దిశా డీఎస్పీ రామారావు, సీడ్స్ సంస్థ నుంచి అమ్మాజీ, డీఐఓ సుబ్బరాజు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

# మంత్రి రాంబాబుపై దాడికి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఖమ్మంలో మంత్రి అంబటి రాంబాబుపై దాడికి ప్రయత్నించిన టిడిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం స్థానిక లాడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఆలిండియా కాపు అభ్యున్నతి సంఘం ఆధ్వర్యంలో ఖబడ్దార్ తెలుగుదేశం గూండాల్లారా అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా కాపు అభ్యున్నతి సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపేట సతీష్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి కూడా కాపు సామాజిక వర్గం పట్ల చిన్నచూపేనని విమర్శించారు. ఏ రంగంలో కూడా కాపులు ఎదగకూడదన్న ఏకైక లక్ష్యంతోనే ఆ పార్టీ ఆరంభం నుంచి పనిచేస్తూ వస్తుందని ఆయన ఆరోపించారు. కార్పొరేటర్ గేదెల రమేష్,కాకి శ్రీను, కోట రాందాస్, జగన్ కోటి, రాతంశెట్టి మన్నార్, నరాలశెట్టి అర్జున్, కారసాని వెంకట్, బ్రాడీపేట రవి నాయుడు, డి.జయ యూత్ ప్రతినిధులు, రేజేటి నవీన్ పాల్గొన్నారు.




# సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్కుషాపు

ప్రజాశక్తి-తాడేపల్లి




మాదక ద్రవ్యాలు, సోషల్‌మీడియా దుర్వినియోగంపై నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్కుషాపు నిర్వహించారు. ఉండవల్లి అంగన్‌వాడీ సెంటర్, పెనుమాక సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా మాదక ద్రవ్యాలు నివారించాలని కోరారు. దీనికి అలవాటు అయితే జీవితాన్ని నాశనం చేస్తాయని చెప్పారు. నిత్య జీవితంలో అనేక మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వల్ల విద్యార్తుల జీవితం నాశనం అవుతుందని అన్నారు. దీనిని నివారించడానికి కౌన్సిలింగ్ సెంటర్లకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ పి.నిర్మల మాట్లాడుతూ అనేక మంది డ్రగ్స్‌కు బానిసలై జీవితాన్ని వృధా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

## ఆర్‌బికెల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఖరీఫ్ 2023 ఈ - క్రాఫ్ ముసాయిదా జాబితాలను ఈ నెల 26 వ తేదీ నుంచి 29 వరకు రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీరంజని చెప్పారు. శుక్రవారం మండలంలోని రాయపూడి, లింగాయపాలెం, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం పంట నమోదు ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాలతో పాటు గ్రామ సచివాలయాల్లో ఉంచామని తెలిపారు. పంట నమోదు జాబితాల గురించి గ్రామసభల్లో రైతులకు వివరించామని, జాబితాలపై ఏమైనా అభ్యంతరాలుంటే గ్రీవెన్స్‌లో నమోదు చేయించుకొని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల ద్వారా పరిష్కరించు కోవచ్చని రైతులకు ఏవో సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## రైల్వే చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

రైల్వే చట్టాన్ని ఉల్లంఘిస్తే వేలాది మంది ప్రయాణికులతో ప్రయాణించే రైలు భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పల్నాడు ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుండి వికారాబాద్ వెళుతుండగా, కుక్కడం-తిప్పర్తి స్టేషన్ల మధ్య ట్రాక్‌పై ట్రాక్టర్ ఇరుక్కుపోవటంతో రైలును నిలిపివేయాల్సి వచ్చిందన్నారు.దీంతో ట్రాక్టర్ యజమానిపై రైల్వే చట్టంలోని సెక్షన్ 154, 174 కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రైల్వే చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించవద్దని కోరారు.

## రేపు కాంగ్రెస్ ఓబీసీ విభాగం సమావేశం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

బిసి జనగణన జరగాలని కోరుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు గుంటూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జక్కా శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఆయనవెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు టి.సాంబశివరావు, మండల అధ్యక్షులు సిహెచ్.రవిబాబు, నాయకులు కె.సతీష్, ఎం.కోటయ్య, కాలేషా ఉన్నారు.

**ప్రజాశక్తి-మంగళగిరి :** గుంటూరు ఏటుకూరు రోడ్డు వివాహ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ఓబీసీ విభాగం చైర్మన్ కుర్రా పున్నారావు కోరారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి ఓబీసీ విభాగం చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకటరావు హాజరవుతారని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి కుల జనగణన ఆవశ్యకతను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి, సీడబ్ల్యూసీలో తీర్మానం ఆమోదింపజేసిన సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని సమావేశంలో సన్మానిస్తామని పేర్కొన్నారు.

## రేషన్ డీలర్లతో తహశీల్దార్ సమావేశం

**ప్రజాశక్తి -మేడికొండూరు :** కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని తహశీల్దార్ శ్రీనివాసశర్మ అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో డీలర్లు, ఎమ్‌డియు ఆపరేటర్లతో శుక్రవారం సమీక్షించారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించబోమన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, పౌరసరఫలాల అధికారి అనిల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం భర్త మృతి

### భార్యకు తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి -తాడేపల్లి కార్పోరేషన్ పరిధి కాజ టోల్ ప్లాజా సమీపంలో ఆగి ఉన్న లారీని ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ఘటనలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల మేరకు... విజయవాడ నగరంలోని రాణిగారి తోటకు చెందిన అంబటి ఆంజనేయులు (31) శిరీష దంపతులు కనిగిరిలోని బం ధువుల వివాహానికి హాజరై శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహ నంపై తిరిగి విజయవాడకు బయలు దేరారు. మార్గ మధ్యం లోని మంగళగిరి -తాడేపల్లి కార్పోరేషన్ పరిధి కాజ టోల్ ప్లాజా సమీపంలోకి వచ్చే సరికి అప్పటికే రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉన్న విజయవాడ కార్పోరేషన్ చెత్త లారీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆంజనేయులు అక్కడి కక్కడే మృతి చెందగా, భార్య శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు సం ఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన శిరీషను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ఆంజనేయులు కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తుండగా ,శిరీష బ్యాంకు మెసెంజర్ గా విధులు నిర్వహిస్తోంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా - రైతు మృతి



ప్రజాశక్తి-ఈపూరు

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎ. ముప్పాళ్ళ గ్రామ సమీపంలోని మేజర్ కాలువ వద్ద శుక్రవారం జరిగింది. పొనుగోటి వారి పాలెం గ్రామానికి చెందిన గుంటుపల్లి ఆంజనేయులు (44) పొగాకు నారు కోసం బంధువులకు సంబంధించిన ట్రాక్టర్ తీసుకొని ముప్పాళ్ళ వస్తున్నాడు. ఇనిమెల్ల మేజర్ కాలువ కట్ట మూలమలుపు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ కాలువలో బోల్తా పడటంతో ట్రాక్టర్ కింద పడి ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య హనుమాయమ్మ, కుమారుడు ఉన్నారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ పరిశీలించారు.



ప్రోగ్రెసివ్ రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజి పాల్ రాజు

## రేసింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గుంటూరుసిటీ

జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రోగ్రెసివ్ రివ్యూ మీటింగ్‌లో గుంటూరు రేంజ్ ఐజి పాల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గుంటూరు రేంజ్ పరిధిలో బైక్ , కారు రేసింగ్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిషే ధించినట్లు చెప్పారు. నిబంధనలను అతిక్రమించి బైక్, కారు రేసింగ్ లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా గ్రేవ్,నాన్ గ్రేవ్ లాంగ్ పెండింగ్ కేసు లలో దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆద ేశించారు. వాటితో పాటు ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని సదరు కేసులను సాధ్యం అయి నంత వరకు త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 'జగనన్నకు చెబుదాం' కు ఫోన్ కాల్స్ ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉం డాలని సదరు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కోర్టు తీర్పు ద్వారా శిక్షలు పడిన కేసులలో రౌడీ షిట్స్ ఒపెన్, వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, రౌడీ షీట ర్లను బైండోవర్ చేయాలని, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ , మిస్సింగ్ కేసులు అరికట్టే విధంగా ప్రతి అధికారి పని చేయాలని చట్టా వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడుతున్న వారితోపాటు బహి రంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు స్టేషన్ పరిధిలో ఉన్న నైట్ డ్యూటీ చూస్తున్న అధికారులు సిబ్బందికి బ్రీఫింగ్ చేసి పంపాలన్నారు. గంజా సేవించే వారిపై కఠించాలని తీసుకొని గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు పూర్తి స్థాయిలో గంజాయి విక్రయాలను అరికట్టాలి అన్నారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరి ష్కరించేందుకు కృషి చేయాలని, రోడ్డుకు అడ్డంగా ఉండే తోపుడు బండ్లు, బండ్లతోపాటు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన వారిపై పెట్టీ కేసులు నమోదు చేసి వారిని కోరుల్టో హాజరు పరచాల న్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు సుప్రజ , నచికేట్ షెల్కే, కె.శ్రీనివాసరావు, కె. కోటేశ్వర రావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

## మద్యం సేవిస్తున్న యువకులు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ


నగరంలోని అరండల్ పేట, లాలాపేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురు యువకులను శుక్ర వారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని అరండల్ పేట, లాలాపేట సిఐలు రామానాయక్, ఎం శ్రీనివాస రావు తెలిపారు. నిబంధనలను మీరితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

## హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-మేడికొండూరు

మండల పరిధిలోని వెలవర్తిపాడులో ఇటీవల ఇరు వర్గాల ఘర్షణలో ఒక వర్గానికి చెందిన వ్యక్తి మృతి చెం దాడు. ఈ సంఘటనకు సంబంధించి మేడికొండూరు పోలీ సులు హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో 15 మం ది నిందితులుగా ఉండగా 8 మందిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.సీఐ వాసు తన సిబ్బందితో కలిసి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా ప్రత్తిపాడు గ్రామ పరి ధిలో నిందితులిద్దరూ సంచరిస్తున్నటు సమాచారం అం దింది. ఇద్దరు నిందితులు మన్నవ మహేష్ కుమార్, మరో మహిళ కుమారిలను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా ఐదుగురిని అరెస్ట్ చేయాల్సి ఉన్నట్లు చెప్పారు.

## 'మీసేవ'లో చోరీ



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నగరంలోని అన్నపూర్ణ థియేటర్ ఎదు రుగా ఉన్న మీసేవ కేం ద్రంలో గురు వారం రాత్రి షట్టర్ తాళాలు తీసి రూ. 40,000 అపహరించారు. మంగళగిరి లోని నటరాజ్ మీసేవ కేంద్రంలో గురువారం 7.30 గంటలకు షాప్ క్లోజ్ చేసి తాళాలను బైకు ముందు భాగంలో మరిచిపోయి ఇంటికి వెళ్లి పోయారు. శుక్రవారం ఉదయం షాప్ తెరు ద్దామని వచ్చి చూడగా షట్టర్ తాళాలు తీసి ఉన్నాయి. సొరుగులో ఉన్న రూ. 40,000 దోచుకెళ్లారని పట్టణ పోలీస్ స్టేషన్లో బాధి తుడు జంజనం నటరాజ్ ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు తెలిపారు.



## మిర్చి నిల్వలు

బ్యాగులు

| | |
|---|---|
| మిర్చి దిగుమతి | : 17,006 |
| మిర్చి ఎగుమతి | : 17,807 |
| మిర్చి నిల్వ | : 7,891 |

## మిర్చి ధరలు

రూపాయలలో

| | |
|---|---|
| 334 | 11,000 - 23,000 |
| 273 | 15,000 - 15,000 |
| 341 | 10,000 - 21,500 |
| 4884 | 15,000 - 20,000 |
| సూపర్ 10 | 18,500 - 18,500 |
| **నాన్ ఎసి** | |
| తేజ | 10,500 - 24,000 |
| బడిగి | 10,000 - 25,000 |
| దేవనూరు డీలక్స్ | 12,000 - 21,500 |
| తాలుకాయలు | 6,000 -14,500 |
| **ఎసి** | |
| 334 | 13,500 - 22,000 |
| నెం.5 | 16,700 - 16,700 |
| 273 | 17,500 - 17,500 |
| 341 | 16,000 - 20,500 |
| తేజ | 11,200 - 23,500 |
| బడిగి | 16,000 - 25,500 |
| దేవనూరు డీలక్స్ | 17,500 - 20,000 |
| తాలుకాయలు | 8,000 -13,000 |

## 'సాగునీరివ్వకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం'



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు సాగు చేసిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీరు ఇవ్వకపోతే పెట్టిన పెట్టుబడి అంతా వృథా అవుతుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజ నేయులు అన్నారు. స్థానిక టిడిపి జిల్లా కార్యా లయంలో శుక్రవారం జిల్లా నియోజకవర్గ ఇన్‌ఛార్జిల విస్తృత స్థాయి సమావేశం జరి గింది. ఈ సమావేశానికి టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రస్తుతం సాగు నీరు, తాగు నీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనం తరం రైతు నాయకులతో కలిసి కలెక్టర్ కార్యా లయం వద్దకు వెళ్లి ప్లే కార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 4 రోజులలో సాగునీరు విడుదల చేసి ఎండు తున్న పంటలను రైతాంగాన్ని కాపాడకపోతే రైతు లను, రైతు నాయకులను ఏకం చేసి కలె క్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సాగు, తాగునీరు వెంటనే విడుదల చేయాలని , పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని నినాదాలు చేశారు. రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని రైతులను ఆదుకోలేని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పరి పాలిస్తున్నాడని విమర్శించారు. కళ్ళ ముందు పంట ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. జిల్లా లో ఉన్న మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని కష్టాల్లో ఉన్న రైతుల గురించి స్పందించలేదన్నారు. సత్తెనపల్లి టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారా యణ మాట్లాడుతూ కనీసం ఆరుదలకి అయినా నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలనే సహ కూడా వైసీపీ నేతలకు లేకుండా పోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదల వాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆర్.బి.కే లో రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పని ముట్లు కూడా ఇవ్వడం లేదని, కనీసం ఎరు వులు విత్తనాలు కూడా అందుబాటులో ఉంచ లేకపోయారన్నారు. పంట దెబ్బతిన్న రైతులను కలెక్టర్ స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధులు గొట్టి పాటి జనార్ధన్ బాబు, పెమ్మసాని నాగేశ్వర రావు, కార్యనిర్వా హక కార్యదర్శులు ముంద్రు సుబ్బారావు, కన్నె దార వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు ప్రాంతంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడి నివారణకు నాడు టిడిపి ప్రభుత్వం రూ.600 కోట్లతో ప్రవేశపెట్టిన వాటర్ గ్రిడ్ పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి నీటి కొళాయి ఇచ్చి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. బొల్లాపల్లి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తెలుసుకునేందుకు గురువారం గ్రామాలను ఆయన సందర్శించి ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గురజాల,మాచర్ల,వినుకొండ ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిం చేందుకు నాడు టిడిపి ప్రభుత్వం వాటర్ గ్రేడ్ ద్వారా ఇంటింటికి త్రాగునీటి కులాయి ఏర్పా టుకు రూ.600 కోట్లు నిధులు కేటాయిస్తే, నాలుగేళ్ల వైసిపి పాలనలో కనీసం 5 శాతం కూడా పనులు పూర్తి చేయలేదని విమ ర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వరికపూడిశెల ప్రాజెక్టుక్ మళ్లీ శంకుస్థాపన అంటూ ప్రజలను మోసం చేయడం దుర్మార్గ మన్నారు. భూగర్భ జలాలు అడుగంటి తీవ్రంగా తాగునీటి ఎద్దడితో అల్లాడిపోతున్న గ్రామాలకు వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# వరికపూడిశెల శంకుస్థాపనకు ఏర్పాట్లు

## ఇనిమెళ్లలో గోదాం ప్రారంభోత్సవంలో ఎంపీ

ప్రజాశక్తి-ఈపూరు

వరికిపూడిశెల ప్రాజెక్టు నిర్మాణంతో పల్నాడు జిల్లా ప్రజల సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని నరసరావుపేట ఎంపి శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని ఇనుమెళ్ళలో ఈపూరు పిఎసిఎస్ ఆధ్వర్యంలో రూ.40 లక్షలు నిధులతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల బహుళ ప్రయోజన గోదామును ఎంపి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపి మాట్లాడుతూ రైతు ప్రయోజనాల దృష్ట్యా వారికి అందుబాటులో ఉండే విధంగా మండలంలో ఐదు గోదాములు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని సచివాలయం, ఆర్బికే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు జరిగిందని, అదే మాదిరిగా మూడు గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకొని గోదాములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గోదాముల ద్వారా నాణ్యమైన ఎరువులు లభిస్తాయని, రైతులందరూ ఈ గోదాములను సద్వినియోగం చేసుకోవాని సూచించారు. నవంబర్‌లో వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు ఎటువంటి అనుమతులు లేకుండానే తూతూ మంత్రంగా శంకుస్థాపనలు చేశారని, తమ ప్రభుత్వం అన్ని అనుమతులు పొందాకే ప్రాజెక్టు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వినుకొండ- గుంటూరు నాలుగు వరుసల రహదారికి సంబంధించి డిపిఆర్ పనులు పూర్తయ్యాయని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామంలో సుమారు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగినట్లు చెప్పారు. వినుకొండ-నూజెండ్ల రోడ్డులో ఆర్‌యుబి నిర్మాణానికి ఎంపి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు,ఈపూరు పిఎసిఎస్ అధ్యక్షులు బొల్లా వెంకట రాధాకృష్ణ,పిఎసిఎస్ సెక్రటరీ పి.కోటేశ్వరరావు, వైసిపి సీనియర్ నాయకులు జి. వెంకట హనుమయ్య, శాఖమూరి బుచ్చయ్య పాల్గొన్నారు.


ఎరువుల గోదాము ప్రారంభిస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

## క్రోసూరులో నేడు మెగాజాబ్ మేళా

ప్రజాశక్తి-బెల్లంకొండ



ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాను పెదకూరపాడు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. అక్టోబర్ 28న క్రోసూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఎంబిఎ చదివిన వారు ఈ జాబ్ మేళాను వినియోగించు కుని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారం భం అవుతుందని 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగు తాయని చెప్పారు. గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హెటెరో డ్రగ్స్, స్కిల్ క్రాఫ్ట్, మదర్సన్ సుమీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యొకో హమా, జయలక్ష్మీ ఆటోమోటివ్స్ వంటి కంపెనీలు మెగా జాబ్ మేళాలో పాల్గొంటున్నట్లు తెలిపారు.


బంగారుతల్లి కార్డులు పంపిణీ చేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

## పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బాలికలకు బంగారు తల్లి పథకం కార్డులను పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో పాంశాలల్లో చదువుతున్న బాలికలకు మండల విద్యాశాఖాధికారి అనంతరం శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థినుల హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థినుల తల్లి దండ్రులను కలసి రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి పాపయ్య, శేషిరెడ్డి, సిఆర్పి తాళ్లూరి నరేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు



ప్రతి ఒక్క విద్యార్థిని పౌష్టికాహారం తీసుకొని రక్త హీన తను అధిగమించాలని మండల ప్రత్యేక అధికారి బాలు నాయక్ తెలిపారు. మండల కేంద్రమైన నకరికల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు రక్త హీనత తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారి ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ నగేష్, ఎంపీడీవో బండి శ్రీనివాస్ రెడ్డి, ఎంఇఒ ప్రసాదు, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు నగేష్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-అమరావతి

కిషోర బాలికలలో రక్తహీనత తగ్గుదల వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గి పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తద్వారా చదువుపై దృష్టి సారించినట్లు అమరావతి ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. బాలికల హిమోగ్లోబిన్ ట్రాకింగ్కు సంబంధించి.. బంగారు తల్లి కార్డు లక్ష్యాల గురించి బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి శ్రీ రామకష్ణ హిందూ హైస్కూల్ లో ప్రతిజ్ఞ చేయించారు.

## విశ్రాంత అధ్యాపకులు జంపని శ్రీహరిబాబుకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విశ్రాంత అధ్యాపకులు జంపని శ్రీహరి బాబు (72) బుధవారం నాడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం నాడు జరిగిన ఆయన అంత్యక్రియలలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

హరిబాబు భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పల్నాడు జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు,యడ్లపాడు తోకల కొటేశ్వర్లు, జరుగుల శంకరరావు, సాతులూరి బాబు, బి.కోటానాయక్, ఎన్. కాళిదాస్,తియ్యకూర ప్రతాప్‌రెడ్డి, సుబ్బారావు, పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు ఉన్నారు.


శ్రీహరిబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

## కుడి జల విద్యుత్ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఏపీ జెన్కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ డివిఎస్ఎస్ఎల్ కాంతారావు శుక్రవారం నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా జల విద్యుత్ కేంద్రంలో జరుగుతున్న పెన్ స్టాక్ సర్వీస్ మొదటి యూనిట్ గేట్ మరమ్మతు పనులను పరిశీలించారు. పెన్ స్టాక్ గేట్ పనులను నవంబర్ 10 లోపు పూర్తి చేయాలని ఈ ఈ వైఎస్ఆర్కే ప్రసాద్ తో చెప్పారు. అనంతరం ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఈఈ 327 యూనియన్ ఆధ్వర్యంలో కాంతారావును ఘనంగా సన్మానించారు. డిఇరాజారెడ్డి, ఏపీఎస్ఈఈ 327 యూని యన్ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు, కార్యదర్శి బి.సూరజ్ చంద్, రామకృష్ణ, తిరుపతి రావు,ఎం.విజిత్ కుమార్ పాల్గొన్నారు.


చీఫ్ ఇంజినీర్ కాంతారావును సన్మానిస్తున్న యూనియన్


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

## ఇండియన్ క్రిస్టియన్ స్కూల్ డైరెక్టర్ బొంతా ఏసుదాసు గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉన్న ఇండియన్ క్రిస్టియన్స్ స్కూల్ డైరెక్టర్ బొంతా ఏసుదాసు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూనే అస్వస్థతకు గురైన ఏసుదాసును హుటాహుటిన పట్టణంలోని ప్రయివేటు హాస్పిటల్ కు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీ కరించారు. ఏసుదాసు 2011 లో అధునాతన పద్ధతిలో ఇండి యన్ క్రిష్టియన్ స్కూల్ స్థాపించి నరసరావుపేట చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులతో పాటు బాపట్ల జిల్లా విద్యార్థులకు అన్ని వర్గాల చిన్నారులకు అందుబాటు ఫీజులతో విద్యనందిస్తున్నారు. ఏసుదాసు మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ సంతాపం తెలిపింది.

## 'సెయింట్ జాన్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కారంపూడి

శ్రీ సత్య సాయి ట్రస్ట్ వారు 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. పి. మహేశ్వరి (9వ, తరగతి ) మొదటి స్థానం, జి. హరీష్ (పదవ తరగతి ) ద్వితీయ స్థానం, పి. పుష్ప చైతన్య (9వ, తరగతి ) తృతీయ స్థానంలో స్కూలు స్థాయిలో ప్రతిభను కనపరిచారు. అలాగే కాలేజీ స్థాయిలో నేచర్ ఈజ్ బెస్ట్ అనే అంశంపై బిషప్ భాగయ్య, జాన్ క్రిష్టిన జూనియర్ కళాశాల విద్యార్థులు మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ప్రతిభను కనపరిచారు.

షేక్ యస్మిన్ (జూనియర్ ఇంటర్) మొదటి స్థానం, జె. కల్పన (జూనియర్ ఇంటర్) ద్వితీయ స్థానం, షేక్ షాహిన్ తృతీయ స్థానంలో విజయం సాధించారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులందరినీ స్కూల్ కరస్పాండెంట్ (ఫాదర్ ), ప్రిన్సిపాల్, స్కూల్, అధ్యాపకులు అందరూ అభినందనలు తెలియజేశారు.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరే!

ప్రజాశక్తి-బెల్లంకొండ


రైతు తాళ్లూరి ముత్యాలరావు

తీవ్ర వర్షా భావం, కాలువకు సాగునీరు విడుదల చేయక పోవడంతో బెల్లంకొండ మండలం లోని పంటలు ఎండి పోతున్నాయి.బెల్లంకొండ మేజర్ కాలువకు నీరు ఇవ్వక పోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లంకొండకు చెందిన రైతు తాళ్లూరి ముత్యాలరావు రెండున్నర ఎకరాలలో వరి పంట సేద్యం చేయగా, నీరు లేక ఎండిపోతోందని, పొలంలో ఉన్న బోరు బావిల నుండి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రూ.60 వేలు పెట్టుబడి పెట్టానని, వరి పంటలు వేసి రెండు నెలలు అవుతోందని, మరో ఇరవై రోజుల్లో పొట్టకు వచ్చి సమ యానికి నీరు లేకపోవడంతో వరి పైరు ఎండి పోయిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి పంట కాలువలకు సాగునీరు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ముందు ముందు పశుపోషణకు వరిగడ్డి దొరికే పరిస్థితి లేదని, పశువులు పెంచుకునే కాపరులు మేత కి వెళ్లే సమయంలో ఎక్కడికి వెళ్లినా నీరు లేక పోవడంతో నానా ఇబ్బందులు గురవుతున్నా రని తెలిపారు. కాలువల ద్వారా నీరు అందించాలని ప్రభుత్వాన్ని పశువుల కాపరులు వేడుకుంటున్నారు.



# పంటలను కాపాడాలంటే కాల్వను పున:నిర్మించాలి

- ఇప్పటికే పలుమార్లు ముంపునకు గురై దెబ్బతిన్న పంటలు
- కుంచనపల్లిలో డ్రెయినేజీ కాల్వను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పంట కాల్వల్లో వర్షపు నీరు బయటకు పంపేందుకు తీసిన డ్రెయినేజీ కాల్వను పున:నిర్మాణం చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలిసి డ్రెయినేజీ కాల్వను ఆయన పరిశీలించారు. వర్షాలు కురిసినప్పుడు, పంట పొలాలలో నిలిచిన వర్షపు నీరు బయటకు పంపేందుకు తవ్విన డ్రెయినేజీ కాల్వ పూడుకుపోయి ఏళ్ల గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. తాడేపల్లి మండల పరిసర గ్రామాల్లో వాణిజ్య పంటలు పండించే రైతులు వర్షాలప్పుడు నీరు అధికంగా పొలాల్లో నిలిచి బయటికి పోయే మార్గం లేకుండా పోయిందని తెలిపారు. అరటి, పసుపు, కంద, ఆకుకూరలు వంటి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని చెప్పారు. ఈ ఏడాది నవంబర్లో వర్షాలు వస్తే పంటలు ముంపు బారిన పడతాయని, ఈ పరిస్థితి తలెత్తకుండా పంట కాల్వను పూడిక తీయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవిలో డ్రెయినేజీ కాల్వలను పూడిక తీయించే వ్యవసాయ అధికారులు కొన్నేళ్లుగా పూడిక తీయించడం లేదని అన్నారు. 2020 అక్టోబర్లో అధిక వర్షాలకు ప్రధాన పంటలైన అరటి, పసుపు, కంద, ఆకు కూరలు ముంపునకు గురై దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. కుంచనపల్లి గ్రామం నుండి మెల్లంపూడి గ్రామ పరిధిలోని బకింగ్ హామ్ కెనాల్ వరకు డ్రెయినేజీ కాల్వ పూర్తిగా పూడుకుపోవడం వల్ల పంటలన్నీ దెబ్బతన్నాయని అన్నారు. 1997 ప్రాంతంలో నిమ్మగడ్డ రామ్మోహ న్రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డ్రెయినేజీ కాల్వ నిర్మాణం చేపట్టారని, ప్రస్తుతం ఆ కాల్వ నిండా చెట్లు, గడ్డి విపరీతంగా పెరిగాయని తెలిపారు. పంటలను కాపాడేందుకు తక్షణమే పూడిక తీయించాలన్నారు. పరిశీలనలో రైతు సంఘం నాయకులు ఎ.రంగారావు, పి.వీరస్వామి, ఎ.అర్జునరావు, రైతులు పాల్గొన్నారు.


కాల్వను పరిశీలిస్తున్న జొన్న శివశంకరరావు, వెంకటరెడ్డి తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ చెంగయ్య

## 2న కంటే రంగారావు వర్ధంతి సభ

ప్రజాశక్తి-మంగళగిరి

సిపిఎం నాయకులు కంటే రంగారావు వర్ధంతి సభ 2వ తేదీన సాయంత్రం 5 గంటలకు స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహిస్తామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వివి జవహర్లాల్ అధ్యక్షతన నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి కంటే రంగారావు అని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలపైనా పోరాడారన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎం.బాలాజీ, ఎస్.వెంకటేష్, ఎస్.గణేష్ పాల్గొన్నారు.



## బస్సుయాత్ర విజయవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి

నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైనట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా జరిగిన బస్సుయాత్రకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించి, పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎం.ప్రభాకర్, ఎ.కిరణ్కుమార్, టి.రమేష్, డి.శ్రీనివాసరావు, కె.సత్యం, పి.సురేష్, కె.నాగేశ్వరరావు, పి.అనిల్కుమార్ పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల మజూరి పెంపుదల కోసం 4న ప్రదర్శన

ప్రజాశక్తి-మంగళగిరి


సమావేశంలో నాయకులు

చేనేత కార్మికులకు 50 శాతం వేతనాలు పెంచాలని చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్ణయించింది. సమావేశం శుక్రవారం రాత్రి స్థానిక సిపిఎం కార్యాలయంలో పి.నాగేశ్వరావు అధ్యక్షతన జరిగింది. సమావేశ నిర్ణయాలను చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ పి.బాలకృష్ణ వెల్లడించారు. మంగళగిరిలో చేనేత వస్త్ర ఉత్పత్తిదారులు అసోసియేషన్, చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ రెండేళ్లకోసారి వేతనాలు పెంపుదలకు ఒప్పందం చేసుకుని అమలు చేస్తారని, ఆ క్రమంలో ఒప్పందం నవంబర్ 19 ముగిసిందని, తిరిగి ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండేళ్ల నుండి నిత్యావసర సరుకులు విపరీతంగా పెరిగాయని, గ్యాస్ ధర రూ.1250కు పెరిగిందని, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు చాలక చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 50 శాతం పెంచాలని కోరుతూ నవంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటలకు పాత మంగళగిరి కళ్యాణ మండపం వద్ద నుండి చేనేత కార్మికుల ప్రదర్శన చేసి చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల అసోసియేషన్ వారికి వినతిపత్రం ఇవ్వనున్నట్లుగా తెలిపారు. చేనేత కార్మికులు చేనేత ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏరియా చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, డి.రామారావు, తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం నాయకులు జి.ధనుంజయరావు, జెవి సుబ్బారావు, చేనేత కాంగ్రెస్ నాయకులు ఆర్.పూర్ణచంద్రరావు, బి.భాలతేదేరు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు జి.వెంకటకృష్ణ, డి.ఈశ్వరరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కె.కోటేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్, ఎస్.లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కు సంబంధించి రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితా శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా ప్రతిని కలెక్టర్ అందించారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 17,37,447 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ముసాయిదాపై అక్టోబర్ 27 నుండి డిసెంబర్ 9 వ తేది వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరిస్తామని తెలిపారు. జాబితాను పబ్లిక్ డొమైన్లో కూడా అందుబాటులో ఉంచామని, ప్రజలు సదరు ముసాయిదా జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని కోరారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డి.ఆర్.ఓ కే.చంద్రశేఖరరావు, ఆమ్ఆద్మీ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు ఆర్.భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, సిపియం నాయకులు వై.కృష్ణకాంత్, టిడిపి నాయకులు కంచర్ల శివరామయ్య, వైసిపి నాయకులు ఎ.జోసెఫ్ కుమార్ పాల్గొన్నారు.

ముసాయిదా జాబితా అందచేస్తున్న కలెక్టర్




మాట్లాడుతున్న డాక్టర్ రమణరావు

## మాజేటి గురవయ్య సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-గుంటూరు

తాను పెద్దగా చదువుకోకపోయినా దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే విద్య పరమార్థాన్ని గ్రహించి విద్య, ధార్మిక, సామాజిక రంగాలకు పునాదులు వేసి వాటి అభివృద్ధికి బాటలు వేసిన మాజేటి గురవయ్య సేవలు వర్తమాన భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ ఎమ్డివి.రమణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం గురవయ్య 74వ స్మారకోపోన్యాస సభ నిర్వహించారు. డాక్టర్ రమణరావు మాట్లాడుతూ అన్ని సామాజిక రుగ్మతలకు సరైన మందు విద్యావంతులు అవ్వడమేనని చెప్పారు.విద్యార్థి దశలో ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలరని అన్నారు. నగరంలో తనలాంటి వేలాదిమందిని తీర్చిదిద్దిన గురవయ్య విద్యా సంస్థలు పది కాలాలపాటు వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలల కార్యదర్శి మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మంచాల బోసు, డాక్టర్ పి.కమలవల్లి పాల్గొన్నారు.

## యోగా కోర్సులకు ఒకటి నుండి అడ్మిషన్లు

ప్రజాశక్తి - ఎఎన్యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్యా కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఎంఎసి యోగా రెండవ సంవత్సరం లేటరల్ ఎంట్రీ పీజీ డిప్లొమా ఇన్ యోగా చేసిన వారు కోర్సుకు ఎంఎస్సి యోగా మొదటి సంవత్సరం కోర్సుకు, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులకు అడ్మిషన్ ప్రక్రియ ఒకటో తేదీ నుండి నుండి ప్రారంభమవుతుందని వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జాన్సన్ తెలిపారు. ఎంఎస్ యోగా రెండవ సంవత్సరం లేటరల్ ఎంట్రీ కోర్సులో అడ్మిషన్ కోసం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్స్లో ఉత్తీర్ణులై ఉండాలని, ఎంఎస్సి యోగా మొదటి సంవత్సరం, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో అడ్మిషన్ కోసం ఏదైనా డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9440315340, 7396458123 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## నూతన డిపిఒను కలిసిన రమేష్

ప్రజాశక్తి - మేడికొండూరు



జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కుసుమ శ్రీదేవిని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ బందెల రమేష్ డిపిఒ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులతో స్నేహ పూర్వక వాతావరణంలో పని చేస్తానని, అన్ని పంచాయతీలను సందర్శించి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు కూడా ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాల సర్వేలను, పనులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ సభ్యులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, బాషా, రమేష్ పాల్గొన్నారు.

# తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రత్యేక సారాంశ సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నమోదు, మార్పులు , చేర్పుల విషయంలో తప్పులు లేని జాబితా ఏర్పాటుకు రాజకీయ పార్టీల ప్రతినిదులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, ఓటరు నమోదు కోసం ఫారం-6, తొలగింపునకు ఫార్మ్- 7, సవరణల కోసం ఫారం-8 లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాబితా ప్రక్రియ 26, డిసెంబర్- 2023 నాటికి పూర్తి కావాలని,రానున్న నూతన ఏడాది జనవరి 5 న తుది జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఓటరు నమోదు ప్రక్రియను బూత్ లెవల్ అధికారుల ద్వారా విడుదల చేయాలని, డూప్లికేషన్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, గుర్తింపుపొందిన 8 రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారులతో సమీక్ష



గ్రామోదయం/నగరోదయం కార్యక్రమంలో భాగంగా బంగారు తల్లి పథకం సమగ్ర అమలుకు, మధ్యాహ్న భోజన పథకంపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.10 ఏళ్ల నుంచి 19 ఏళ్ల బాలికలు, యువత వరకు వరకు ఎనీమియా బారీ నుండి రక్షణ పొందేందుకు, వారిలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించే శాతం కార్యక్రమం బంగారు తల్లి గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు బాలికల్లోనూ, యువత లోనూ రక్తహీనత శాతం తక్కువగా ఉండడం పల్నాడు జిల్లాలో అధి కంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు దీనిపై అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, కళా శాలలు, ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ స్థాయిలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, అన్ని మున్సిపాలిటీలు, అన్ని శాఖల అధికారులతో ఈ సమస్య నివారణకు సమావేశం నిర్వహించారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావా లన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా చిన్నపిల్లల దగ్గర నుంచి యువత వరకు రక్తహీనత శాతాన్ని తగ్గించి, వారిలో రక్తహీనత పెంచేందుకు చైతన్య పరచాలన్నారు. అనతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై స్పందన అడిగి తెలుసు కున్నారు. అదేవిధముగా జగనన్నకు చెబుతాం లో వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించేలా చూడాలని సూచిం చారు. హౌసింగ్ స్టేజి కన్వర్షన్ పై సమీక్షించారు.

## ఈపూరులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-ఈపూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ కు అందజేశారు. అగ్నిగుండాల గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం తండావాసులు అగ్నిగుందాల గ్రామం నుండి తండా కు రోడ్డు అధ్వానంగా ఉందని రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, తండాలో అంగన్వాడి కేంద్రం లేదని తెలుపగా డిసెంబర్ ఒకటి నుండి మినీ అంగన్వాడి కేంద్రం ప్రారంభిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కొచ్చర్ల గ్రామానికి చెందిన రైతులు గ్రామ సర్పంచ్ తమ పొలంలో దౌర్జన్యంగా కాలువ తీశారని ఫిర్యాదు చేశారు. కూచినపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేలో తన వద్ద ఉన్న భూ పత్రాలలో కంటే పొలం తక్కు వగా చూపారని తెలిపారు.అర్జీల రూపంలో అందుకున్న సమస్యలను 60 రోజులలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తో కలిసి ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి విద్యాసామర్ధ్యాలను పరీక్షించారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని భోజనశాల ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టర్‌ను కోరగా అంచనాలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులలో హిమోగ్లోబిన్ శాతం నమోదు పై ఆరా తీయగా ఎటువంటి వివరాలు నమోదు చేయకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమోగ్లోబిన్ తక్కువ శాతం ఉన్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆట స్థలం ఎత్తుపల్లాలు లేకుండా చదును చేసేలా అధి కారులను ఆదేశించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహాలను సందర్శించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు.స్థానిక వైద్య అధికారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను కలెక్టర్ కు వివ రించారు. రూ. 6 కోట్లు నిధులతో నిర్మాణ దశలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డిఓ శేషి రెడ్డి, మండల ప్రత్యేక అధికారిని ఎస్ వరలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ లక్ష్మి,తహసిల్దార్ అచ్యుత వెంకట సుధాకర్, ఎంపీడీవో ఏవి రంగనాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు

## విజిలెన్స్ మారథాన్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా

విద్యార్థి దశలోనే నీతి నిజాయితీగా వ్యవ హరించడం అలవాటు చేసుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవేర్నెస్ మారథాన్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ మారథాన్ అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ఆయా రంగాలలో నెలకొన్న అవినీతి నిర్మూలనకు విద్యార్థి దశలోనే నడుం బిగిం చాలని సూచించారు. ముఖ్య అతిథి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి. కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు, బ్యాంక్ ఉద్యోగులలో ఉన్న ఐక్యత నిజాయితీ జవాబుదారితనం పెంపొందించడానికి విజిలెన్స్ అవే ర్నెస్ మారథాన్ సదస్సులు దోహద పడతాయని చెప్పారు. అవినీతి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. సదస్సులోని అం శాలకు సంబంధించి విద్యార్థులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమట నేని నాసరయ్య, యూనియన్ బ్యాంక్ ఏజీఎం సచిన్ దేవ్, జనరల్ మేనేజర్ పి.మారుతి రామ్, ఈదర రాంబాబు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

## ఇజ్రాయిల్ దాడులు పాశవికం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు అత్యంత పాశవికంగా ఉన్నాయని, పసిపిల్లలు , మహిళలు అనే తేడా లేకుండా వేలమంది నిత్యం మత్యువాత పడు తున్నారని పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ స్థానిక ఎన్జీఓ హోమ్‌లో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరి గింది. ఈ సమావేశానికి పిడిఎం రాష్ట్ర కార్యదర్శి జి.రామ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా అండదండలతో బరితెగించిన ఇజ్రాయిల్ చేస్తున్న ముప్పేట దాడులతో గాజా నగరాన్ని ధ్వంసం చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ ను సమర్ధించడం సబబు కాదన్నారు. పాలస్తీన ప్రజలకు అండగా ఉండాలని, ఇజ్రాయిల్ దాడులు నిలిపివేయాలని, పాలస్తీనా న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు, పీడియం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్వలి, ఎంసీపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, ఎంఐఎం పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ ధరి యావలి, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా నాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సికినం చిన్నా, బీసీ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'చంద్రబాబు అరెస్టు కక్షపూరితం'

ప్రజాశక్తి-సత్తెనపల్లి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడును అవినీతిపరునిగా చూపించేందుకే కక్ష పూరితంగా అక్రమంగా అరెస్టు చేశారని, ఇది అప్రజా స్వామ్యమని టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు.

## 'ఎంపి గోరంట్ల మాధవ్ పైచర్యలు తీసుకోండి'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

హిందూపూర్ పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, రాజమండ్రి సెంట్రల్ జైల్లో వున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు సబబు కాదని అన్నారు. ఆయనపై చేర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రభాకర్ కు వినతి పత్రాన్ని అందించారు.

## జిల్లా జట్టుకు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి- రెంటచింతల



ఉమ్మడి గుంటూరు జిల్లా తక్కెళ్ళ పాడు గ్రామంలోని జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో శుక్రవారం బాల బాలికలకు అండర్ -14 త్రో బాల్ సెలక్షన్స్ నిర్వహించారు. మండల కేంద్రమైన రెంట చింతల లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.కార్తీక్ నాయక్ ఎంపికయ్యాడు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌లో కర్నూలుజిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థి కార్తీక్ నాయక్ ను ఆ పాఠశాల ప్రిన్సిపల్ మోహన్‌తోపాటు తదితర అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.



## గ్రానైట్ సంస్థ పనుల ఆపాలన్న అర్జీపై పరిశీలన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మైనింగ్ అధికారులను సైతం పక్కదారి పట్టించి తవ్వకాలకు అనుమతులు తీసుకున్న చెంచుకుమారి బ్లాక్ గ్రానైట్ సంస్థ పనులను ఆపించాలని, అనుమతులు రద్దు చేయాలని కోరుతూ చిలకలూరిపేట పట్టణానికి చెందిన నార్నే హనుమంతరావు గతంలో పెట్టిన అర్జీ నిమిత్తం శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఈ మేరకు మైనింగ్ భద్రాధికారి (డైరెక్టర్ ఆఫ్ మై న్స్ సేఫ్టీ అధికారి)రఘుపతి పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. బొప్పుడిలో, దాని చుట్టూ ప్రక్కల ఉండే పలువురు గ్రామస్తులను ఈ క్వారీ వల్ల జరిగే నష్టాలు,జీవరాశికి కలిగే నష్టాల గురించి విచారించినట్లు చెప్పారు. చట్టపరమైన తదుపరి చ ర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా నార్నే హనుమంతరావు మాట్లాడుతూ ఈ క్వారీ వల్ల వాతా వర ణం పాడై పోవతమే కాకుండా మనుషులకు,జంతువులకు కూడా ప్రాణ గాని ఉందన్నారు. పలుమార్లు ఈ విష యాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అప్పలనాయుడు,నెల్లూ రు,అసి స్టెంట్ జియాలజీ పల్నాడు జిల్లా ఎం.ఆనంద్ పాల్గొన్నారు.



## అనారోగ్యంతో మృతి చెందిన వీఆర్వోకు నివాళి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలం లోని జలాలపురం గ్రామానికి చెందిన వీఆర్వో పాటిబండ్ల బాలస్వామి అనారోగ్యముతో శుక్రవారం మరణించారు. బాలస్వామి భౌతికకాయానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పెదకూరపాడు తహశీల్దార్ జియా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు తమసానుభూతి వ్యక్తం చేశారు.

## రొంపిచర్లలో మాజీ మంత్రి కాసు పర్యటన

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండల కేంద్రమైన రొంపిచర్ల లో శుక్రవారం మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి పర్యటించారు. గ్రామంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి స్వగహానికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బా రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బా రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

## రైతు కడుపు కోతకు ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి-బెల్లంకొండ

రైతు కడుపుకోతకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బెల్లంకొండ మండల తెలుగుదేశం పార్టీ దళిత నాయకుడు గడ్డిపర్తి నాగేశ్వరరావు( సముద్రం) డిమాండ్ చేశారు. నీరు లేక వెలవెలబోతున్న పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులను వారి సమ స్యలను తెలుసుకున్నారు నష్టపోయిన ప్రతి రైతు కుటుం బాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# విధులు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన





**ప్రజాశక్తి-మంగళగిరి**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం పోలీస్ ఆయుధాల ప్రదర్శన (ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్)ను పట్టణ సిఐ మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌విధి నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సంఘ వ్యతిరేక శక్తులను ఎదుర్కొంటూ, శాంతి, భద్రతల పరిరక్షణకే బాధ్యతగా 24 గంటలు పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారని చెప్పారు. ఉద్యోగ బాధ్యతలకు మొదటి ప్రాధాన్యం ఇస్తారన్నారు. విధుల్లో భాగంగా పోలీసులు వాడే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానంపై విద్యార్థులు, ప్రజలకు తెలియజేసేందుకు ఓపెన్ హౌస్ చాలా ఉపయోగపకరమన్నారు. ప్రదర్శనను చూడ్డానికి వచ్చిన విద్యార్థులకు వేలిముద్రలు, కంట్రోల్ రూం, కమ్యూనికేషన్స్, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్‌స్క్వాడ్, ఏకే 47 తుపాకీ, కార్బన్ ఆయుధాలు తదితర వాటిపై వివరించారు. పట్టణ ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఎస్ఐ శివ నాంచారయ్య పోలీస్ అధికారులు, సిబ్బంది విధులను వివరించి స్టేషన్‌లోని లాకప్ గదులను చూపించారు.

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులకు పొన్నూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ఎస్ఐ షేక్ హసీం మాట్లాడుతూ మనల్ని సురక్షితంగా ఉంచడానికి పోలీసులు నిత్యం కృషి చేస్తారని చెప్పారు. అనంతరం పోలీస్ స్టేషన్లో లాకప్, ఎఫ్ఐఆర్, రికార్డులు, రివాల్వర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

మంగళగిరిలోని ఎంపిఎస్‌పి 6వ బెటాలియన్‌కు చెందిన పోలీసు అధికారులు వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విద్యార్థులకు ఆయుధాల గురించి అసిస్టెంట్ కమాండెంట్ డీఎస్పి పివి.హనుమంతు అవగాహన



కల్పించారు. అనంతరం ఆయన శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు ఉపయోగించే వివిధ ఆయుదాలు, రైఫిళ్లతో పాటు ఎకె47 వంటి అత్యాధునిక మెషిన్‌గన్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాదిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ప్రేరణ పొంది పోలీసు, నేవి వంటి భారత బలగాలలో సేవలందించడానికి ఆసక్తి చూపుతారని అన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, 6వ బెటాలియన్ ఆర్ఐలు పి.చంద్రారావు, జి.సుభాష్ చంద్రబోస్, ఆర్ఎస్ఐ ఎం.లోకేష్, ఎఆర్ఎస్ఐలు పి.రఘుబాబు, ఎస్.మూర్తి, వైవి.సుబ్రమణ్యం, హాబీక్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు పాల్గొన్నారు.



**ప్రజాశక్తి - గుంటూరు సిటీ**

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులతో పాటు పోలీస్ సిబ్బందికి క్విజ్, వక్తృత్వ పోటీలను జిల్లా పోలీసులు అధికారులు శుక్రవారం నిర్వహించారు. సమాజంలో పోలీస్ పాత్ర, మహిళలు, చిన్నపిల్లలపై లైంగిక దాడుల అంశాలపై జరిగిన వ్యాసరచన పోటీలకు డీఎస్పీలు మంగారావు, నాగార్జున, చంద్రశేఖర్, వసుంధర దేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు వారోత్సవాల ముగింపులో బహుమతులు ప్రదానం చేస్తామని ఎఆర్ అదనపు డిఎస్‌పి చంద్రశేఖర్‌రావు తెలిపారు. పోటీలను ఆర్ఐలు రాజారావు, థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాఘవయ్య పర్యవేక్షించారు.



భవనాల ప్రారంభోత్సవంలో హెని క్రిస్టినా, సురేష్‌కుమార్

## సిరిపురంలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని సిరిపురంలో వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాల భవనాలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ నిర్మాణాలను రూ.కోటితో చేపట్టినట్లు క్రిస్టినా చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైసిపి తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ సిరిపురం గ్రామానికి ఇప్పటి వరకు రూ.23 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గతంలో 14 ఏళ్లు పరిపాలించిన చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. టిడిపి పాలనకు వైసిపి పాలనకు తేడా గమనించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైసిపి మళ్లీ గెలిస్తే రాష్ట్రంల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.స్వప్న, ఎంపిడిఒ కె.ప్రభాకరరావు, వైసిపి మండల అధ్యక్షులు టి.వంశీకృష్ణ, నాయకులు కె.పరమేశ్వరరావు, సాంబశివరావు, ప్రదీప్ కుమార్, జెసిఎస్ కన్వీనర్ అబ్బాస్ పాల్గొన్నారు.



## హైలెవెల్ ఛానల్‌లో వ్యర్థాల తొలగింపు

**ప్రజాశక్తి-దుగ్గిరాల:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో శుక్రవారం హైలెవెల్ ఛానల్లో గుర్రపు డెక్క తూటి కాడ తొలగింపు చేపట్టారు. హైలెవెల్ ఛానల్ కింద సాగుతున్న భూములకు నీరందటం లేదని పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న లోకేష్ కొంత నగదును అందించగా దానితో జెసిబి, కూలీలను ఏర్పాటు చేయించి కాల్వలో అడ్డంకులు తొలగించే పనిని చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ 370 క్యూసెక్కులు అవసరమైన హైలెవెల్ ఛానల్‌కు 200 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారని, దీనితో పొలాలకు నీరు సరిగా అందడం లేదని అన్నారు. కాల్వలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్క వల్ల ఆ 200 క్యూసెక్కులు సైతం చివరి భూములకు అందటం లేదన్నారు. దీనితో డీజిల్ ఇంజన్లతో నీరు పెట్టుకోవడం కూడా కష్టమైందని, ఎమ్మెల్యే నిర్లక్ష్యం వైఖరి వల్లనే పంట పొలాలకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.శ్రీఅనిత, నాయకులు కె.శివనాగమల్లేశ్వరరావు, టి.సీతారామయ్య, శేషగిరి, ఏసుపాదం, ప్రసాద్, ఎన్.ఆనంద బాబు, ఎల్.శ్రీనివాసరావు, షేక్ జాకీర్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :** కెఎల్‌యు రోడ్డులో విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం కొలనుకొండ, గుండిమెడ గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళగిరి విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.



## 'దళితులను మోసం చేసిన వైసిపి'

**ప్రజాశక్తి - తుళ్లూరు**

వైసిపి పాలనలో రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని దళితులందరూ మోసపోయారని అమరావతి దళిత జెఎసి, టిడిపి తాడికొండ నియోజకవర్గ నాయకులు పులి చిన్నా విమర్శించారు. వచ్చే ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో వైసిపికి దళితులు గట్టి గుణపాఠం చెబుతారని అన్నారు. నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమం ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం రాజధానిలోని ఉద్దండరాయు నిపాలెంలో రైతులు ప్రదర్శన చేయగా చిన్నా మాట్లాడారు.

## ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వీరయ్య బాధ్యతలు

**ప్రజాశక్తి-దుగ్గిరాల**

దుగ్గిరాల ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ డి.వీరయ్య శుక్రవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ కుసుమ శ్రీదేవి డిపిఒగా ప్రమోషన్ పొంది గుంటూరుకు బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు ఎంపిపి డి.సంతోష్ రూపవాణి, వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.



వీరయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపిపి

# టిడిపికి సంక్షోభాలు కొత్తేమీ కాదు : ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

**ప్రజాశక్తి-తెనాలి**

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనను ఎత్తిచూపుతున్నందుకే అవినీతి మరకను అంటించి చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేయించారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక నాజరుపేట ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో టిడిపి తెనాలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓడిపోతే జగన్ మళ్లీ జైలుకు వెళ్లడం తథ్యమని భావించి, కుట్రపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఇలాంటి అరెస్టులు, సంక్షోభాలు టిడిపికి కొత్తేమీకాదన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి జగన్ ప్రభుత్వం పోరాటం చేస్తామన్నారు. టిడిపి, జనసేన సమిష్టిగా ముందుకు సాగుతాయన్నారు. సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ వర్గాలకు అమలు చేసినసంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం ఎందుకు తొలగించిందో చెప్పగలరా? అని ప్రశ్నించారు. సామాజిక సాధికార బస్సుయాత్ర అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వైసిపి పాలనను పారదోలేందుకు ప్రజలు సిద్ధం కావాలని అన్నారు. భువనేశ్వరి చేపట్టే నిజం గెలవాలి యాత్ర, లోకేష్ చేపట్టే బాబు భరోసా, భవిష్యత్‌కు గ్యారంటీ, యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలనే తీర్మానాలను ఈ సందర్భంగా ఆమోదించారు. నాయకులు టి.హరిప్రసాద్, వి.సాంబిరెడ్డి, కె.ఏడుకొండలు, జె.మహేష్, సిహెచ్.పుల్లారావు, ఎ.వెంకటేశ్వరరావు, డాక్టర్ వి.శేషగిరిరావు, మహ్మద్ ఖుద్దూస్, డి.అనిత, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పాఠశాలలో పూర్వ విద్యార్థి మొక్కలు



మొక్కల నాటుతున్న ఎంఇఒ తదితరులు

**ప్రజాశక్తి - కాకుమాను**

మండల కేంద్రమైన కాకుమానులోని జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛత సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ కెఎఫ్ కెనడి మాట్లాడుతూ పాఠశాలలకు పూర్వ విద్యార్థులు వెన్నుముక లాంటి వాళ్లని, పాఠశాలను మరింత మరింత పచ్చగా ఉంచుకునేందుకు గాను పూర్వ విద్యార్థులు నూతి సత్యనారాయణ రూ.14 వేలతో 200 పైగా మొక్కలను అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం నూతి సత్యనారాయణ, ఎంఇఒ, విజయభాస్కర్, హెచ్ఎం కె.సత్యం కలసి మొక్కలు నాటారు.

## పక్షవాతంపై నేడు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజారోగ్య వేదిక నాయకులు

ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక బ్రాడీపేట 2/7లోని గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ సహకారంతో ప్రాథమిక పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక జిల్లా నాయకులు ఎల్.ఎస్ భారవి, వై.సుబ్బారావు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లుగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా గుంటూరులోని ప్రముఖ న్యూరో ఫిజీషియన్లతో పక్షవాతముపై అవగాహన, సందేహాలు నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని అన్నారు. పక్షవాతానికి సంబంధించిన ప్రాథమిక పరీక్షలు ఉచితంగా చేస్తారని, అనంతరం వైద్యులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య జిల్లా నాయకులు యన్.హనుమంతరావు, శశిధర్ పాల్గొన్నారు.

## పక్షవాతంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

### ఎపి న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ

ప్రజాశక్తి-గుంటూరు




స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ, ఇతర వైద్యులు

వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎస్ఒ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా పక్షవాతంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ తెలిపారు. పక్షవాత నివారణ, లక్షణాలు, పక్షవాతంతో బాధపడుతున్న వారి అవసరాలపై దృష్టి సారించి, పక్షవాతంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అక్టోబర్‌ను స్ట్రోక్ అవగాహన నెలగా పాటిస్తోందన్నారు. లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ వారి అంకినీడు స్ట్రోక్ సెంటర్ భారతదేశపు మొట్టమొదటి సర్టిఫైడ్ అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌గా గుర్తింపు పొందిందని, 2008 సంవత్సరం నుండి క్రమం తప్పకుండా వరల్డ్ స్ట్రోక్‌డే అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రపంచ పక్షవాత దినోత్సవం గుంటూరులోని లలిత హాస్పిటల్‌లో అక్టోబరు 23 నుండి అక్టోబర్ 29 వరకు అనేక పక్షవాత అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత స్ట్రోక్ స్క్రీనింగ్ డెస్క్, పీజీలు, వైద్యులు, న్యూరాలజిస్టుల కోసం స్ట్రోక్ మేనేజ్‌మెంట్‌పై సిఎంఇ నిర్వహించామని అన్నారు. సకాలంలో చికిత్స కోసం పక్షవాత లక్షణాలను గుర్తించడం చాలా ముఖ్యమని, పక్షవాత లక్షణాలను గుర్తించడానికి BEFAST అనే ఒక సాధారణ పరీక్షను ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. సమతుల్యత కోల్పోవటం, తలనొప్పి, మైకం, చూపు మసకబారటం, మూతి వంకర, చేయి, కాలు చచ్చు పడటం, మాటలో తేడా రావటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు గురించిన వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని సూచించారు.

## సిజిజిబి ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ గుంటూరు రీజినల్ ఆఫీసు, నగరంలోని అన్ని శాఖలు కలిసి స్వచ్ఛత కార్యక్రమాన్ని బ్యాంక్ ఉన్నతాధి కారులు, ఖాతాదారుల సమక్షంలో బృందావన్ గార్డెన్స్ విష్ణు వాకింగ్ ట్రాక్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ యొక్క 253 శాఖలు, 4 రీజినల్ ఆఫీసులు, హెడ్ ఆఫీస్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయటం, రికార్డ్ నిర్వహణ, ప్రజాసంక్షేమం దష్ట్యా పరిసరాల పరిశుభ్రత వంటి అనేక అంశాలను అమలు చేయటంలో నిర్విరామ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం గార్డెన్స్ టెంపుల్ ప్రాంగణంలో జాయింట్ సెక్రటరీ వి.నాగేశ్వరరావు, కాకతీయ కన్వెన్షన్ సొసైటి అధ్యక్షులు డాక్టర్ జి.వి. రాయుడు చేతులమీదుగా మొక్కలు నాటారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా, బ్యాంక్ విజిలెన్స్ ఇన్-ఛార్జ్ ఈ.రాంబాబు, విజిలెన్స్ ఆఫీసర్ ఎన్.వి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బ్యాంక్ సిబ్బంది సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు జిఎం పి.మారుతిరాం, గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి, ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

# పల్నాడు బాలోత్సవం బ్రోచర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

డిసెంబర్ 8, 9 తేదీల్లో పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించే పల్నాడు బాలోత్సవం (పిల్లల పండుగ), చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించి కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించేలా బాలోత్సవాలు నిర్వహించాలని, ఈ కార్యక్రమం జయప్రదానికి అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా చిత్రకళా పోటీలు నిర్వహించగా విశేష స్పందన లభించిందని తెలిపారు. 1200 మందికి పైగా బాలబాలికలు చిత్రకళా పోటీల్లో పాల్గొన్నారని, ఈ అనుభవంతో పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పల్నాడు బాలోత్సవం అనే విభాగం ఏర్పడి పనిచేస్తోందని వివరించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో నర్సరావుపేట పట్టణంలోని పిఎన్‌సి అండ్ కెఆర్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయిలో బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. 30 రకాల సాంస్కృతిక, అకడమిక్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సబ్ జూనియర్స్ 3, 4, 5 తరగతులు, జూనియర్స్ 6, 7 తరగతులు, సీనియర్స్ 8, 9, 10 తరగతులు విభాగాలకు కలిపి మొత్తం 66 అంశాల్లో పోటీలు ఉంటాయని, ప్రతి ఈవెంట్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని, పాల్గొన్న ప్రతి విద్యార్థికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని వివరించారు. బాలోత్సవంలో పాల్గొనే బాలలకు, వారితోపాటు వచ్చే ఉపాధ్యాయులకు భోజన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి పాఠశాలకు బాలోత్సవం కమిటీ సభ్యులు ఎంట్రీ ఫారాలను తీసుకువెళ్లి అందిస్తారని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ పోటీలకు తమ విద్యార్థులను పంపించడానికి సహకరించాలని కోరారు. ఎంట్రీ ఫారాలు పూర్తి చేసి నవంబర్ 30 తేదీలోగా తమకు అందించాలన్నారు. బ్రోచర్లో తెలిపిన క్యూఆర్ కోడ్ లేదా వెబ్‌సైట్ అడ్రస్ ద్వారా ఎంట్రీలను అప్లోడ్ చేయవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం పల్నాడు బాలోత్సవం కమిటీకి సభ్యుల 7207450369, 9440915861, 9491369330, 7893483132, 9390070555 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్షులు, ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి, సహాయ కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కోశాధికారి కె.రామారావు, కమిటీ సభ్యులు సాంబశివరావు, జి.శ్రీనివాసరావు, వెంకట్రావు, విజయసారధి, డి.బుజ్జిబాబు, నాగేశ్వరరావు, పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

## ఆర్‌విఆర్‌లో కొనసాగుతున్న ఎన్‌సిసి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు



శిక్షణ ఇస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

ధైర్య సాహసాలతో సత్వర సహాయం, ప్రాథమిక చికిత్స అందించటం ప్రాణరక్షణకు మూలకారణమని కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహిస్తున్న 10-ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సిసి, ఎటిసి-5 క్యాంపులో శుక్రవారం ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో విపత్తుల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై శిక్షణిచ్చారు. తుపానులు, భవనాలు కూలిపోవటం, కొండచరియలు విరిగి పడటం, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో ప్రజల్ని రక్షించేందుకు సత్వర, సమర్థవంతమైన సహాయక చర్యలను, ప్రాథమిక చికిత్స విధానాన్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ కెప్టెన్ మహేష్, అగ్నిమాపక శాఖ ఎడిఎఫ్ఒ కె.కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి కేడెట్లకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రజిత్ ముకుందన్, క్యాంపు ఎస్.ఎం.సుబేదార్ పాణ్యం రఫీ పాల్గొన్నారు.

## స్టాన్ఫోర్డ్ యుఐఎఫ్ ప్రోగ్రాంకు ఎంపికైన వివిఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు విద్యార్థులు స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ డిజైన్ స్కూల్ నిర్వహించే యుఐఎఫ్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రోగ్రాంకు వివిఐటి నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణం అని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నెదర్లాండ్స్ యూనివర్సిటీ ఆఫ్ ట్వెంటీలో జరిగే యుఐఎఫ్ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ ప్రోగ్రాం డిజైన్ థింకింగ్‌తో విద్యార్థుల మేథస్సుకు పదును పెడుతుందన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు పోపూరి రిషిత, అభినవ్ అడ్డగట్ల, అభిరామ్ జొన్నలగడ్డ, చరిష్మా నేలకుర్తి, కృష్ణ సుమంత్‌రెడ్డి పొలసాని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ఆరు వారాలపాటు నిర్వహించిన డిజైన్ థింకింగ్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని వివరించారు. 2017 సంవత్సరం నుంచి కళాశాలలో ప్రారంభమైన యుఐఎఫ్ ప్రోగ్రాం ద్వారా ఎంపికైన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, యుఐఎఫ్ ఫ్యాక్టరీ ఛాంపియన్ పిఆర్ కృష్ణప్రసాద్, డాక్టర్ సురేష్‌బాబు కొల్లూరు పాల్గొన్నారు.



## 5జీ ల్యాబ్ స్థాపనకు విజ్ఞాన్ యూనివర్సిటీ ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

నూతన ఆవిష్కరణలు, పరిశోధనలను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ మినిస్ట్రీ విభాగం 5జి ల్యాబ్స్ స్థాపినకు విజ్ఞాన్ యూనివర్సిటీని ఎంపిక చేసినట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్-2023 గ్లోబల్ డిజిటల్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో ప్రధాని మోడీ విజ్ఞాన్స్‌తోపాటు, దేశంలోని 100 యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్స్ స్థాపనకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. ఆన్‌లైన్ మోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో వీక్షించారు. ఇన్నోవేషన్‌లో భాగంగా విద్యార్థుల స్టార్టప్ కమ్యూనిటీస్‌ను మరింత అభివృద్ధి చేసి నేషన్ బిల్డింగ్ కోసం విజ్ఞాన్స్ యూనివర్సిటీను 5జీ ల్యాబ్ స్థాపనకు ఎంపిక చేసిందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిమ్స్‌లో జర్మనీతో సహకార కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సిమ్స్ కళాశాలలో శుక్రవారం భారత దేశం, జర్మనీ దేశాల మధ్య విద్య, సాంఘిక, సాంస్కృతిక, మానవతావాదంపై సహకార కార్యక్రమం నిర్వహించారు. ఇరు దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు విద్య, పరిశోధన, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిమ్స్ కాలేజి సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష మాట్లాడుతూ ఈ కార్యక్రమం రెండు దేశాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. రెండు దేశాల అధ్యాపకులు, విద్యార్థులు ఒకరి నుండి ఒకరు నేర్చుకునే అవకాశం ఉందన్నారు. సిమ్స్ డైరెక్టర్ బి.భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మూడ్రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం జర్మనీకి చెందిన డాక్టర్ వోల్కర్ రల్ఫ్ ముల్లర్ ప్రసంగించారు. కార్యక్రమం ద్వారా సిమ్స్ విద్యార్థులు జర్మనీలో చదువుకోవటానికి, జర్మనీ విద్యార్థులు సిమ్స్‌లో చదువుకోవటానికి అవకాశం ఏర్పడుతుందని సిమ్స్ సెక్రెటరీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రిస్టినా, డాక్టర్ పౌలిన, డాక్టర్ తంగబాలన్, డాక్టర్ బి.సంధ్య పాల్గొన్నారు.